క్లుప్తంగా

కల్యాణ మండపంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



క్రాయపాలెం(కొల్లిపర): మండల పరిధిలోని చక్రాయపాలెం గ్రామంలో కల్యాణ మండపంలో పలు అభివృద్ధి పనులకు శనివారం చందు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబురావు, బూరెల దుర్గాప్రసాద్, ఈమని హరికోటిరెడ్డి, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్‌కు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



తెనాలిఅర్బన్: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ జట్టుకు గంగానమ్మపేటలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థినులు జి.యశస్విని, డి.సంధ్యలు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బి.రాధా తెలిపారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఈ నెల 12,13 తేదీల్లో ఈ ఎంపికను నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను శనివారం పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, ఆర్ఐ అప్పాజీ, ఏఓ గోపి, వ్యాయామ ఉపాధ్యాయులు గోపీకృష్ణ పాల్గొన్నారు.

శరవేగంగా బీటీ రహదారి నిర్మాణం



మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో ఉన్న శ్రీ కృష్ణానంద ఆశ్రమం వద్ద నుంచి రామాలయం సెంటర్ వరకూ సుమారు రూ.1.83 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పారిశ్రామికవాడ ప్రాంతం కావడంతో నిత్యం ఆయా పరిశ్రమలకు లారీలు, ఇతర వాహనాల్లో మెటీరియల్స్ తరలి వస్తుంటుంది. పరిశ్రమల యజమానులకు సైతం ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రాత్రి వేళ బీటీ రోడ్డు పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం కుప్పలుగా పోసిన వెట్‌మిక్స్‌ను డ్రోజర్, రోలర్‌తో చదును చేస్తున్నారు. బీటీ రహదారి నిర్మాణ పనులను వీలైనంత మేరకు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో రూ.60 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాన్ని శనివారం ప్రారంభించారు. ఇప్పటంలో ఏడు రహదారులకు కార్పొరేషన్ ప్రత్యేక నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టామని, ఏడు రోడ్లు రూ.60 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామని, ముఖ్యంగా ఇప్పటం వైఎస్సార్, వంగవీటి మోహనరంగా కల్యాణ మండపం రహదారి నిర్మాణ పనులు చేస్తున్నామని డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. మిగిలిన ఆరు రోడ్లను త్వరలోనే ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిగా రవీంద్రబాబు

తాడేపల్లిరూరల్: జేసీఎస్ మండల ఇన్‌ఛార్జిగా యేమినేని రవీంద్రబాబును నియమిస్తూ శనివారం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రవీంద్రబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఆర్కేకు, ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

అభయాంజనేయుడికి నాగవల్లీదళార్చన

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలోని సువర్చలా సమేత అభయాంజనేయ స్వామికి శనివారం ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు డి.కృష్ణమూర్తి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్తనామ పూజలు చేశారు. వడపప్పు, అప్పాలు నివేదన చేశారు.

ప్రశాంతంగా ముగిసిన ఉప ఎన్నికలు

తెనాలిరూరల్: గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం కోలాహలం నెలకొంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. తెనాలి మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో సర్పంచ్ పదవితో పాటు హాఫ్‌పేట గ్రామంలోని 7వ వార్డు మెంబర్ ఎంపికకు శనివారం ఉప ఎన్నికలు నిర్వహించారు. కీలకమైన సర్పంచ్ పదవికి ఎన్నికలు కావడంతో అందిరి దృష్టి బుర్రిపాలెం పైనే కేంద్రీకృతమైంది. సర్పంచ్ పదవికి ఇక్కడ ఐదుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. గతంలో టీడీపీ మద్దతుతో సర్పంచ్‌గా గెలిచిన వ్యక్తి మృతి చెందడంతో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి నామినేషన్ వేసి కూడా గత సాంప్రదాయాలను పాటిస్తూ విత్ డ్రా చేసుకున్నారు. ఎన్నికల సందర్భంగా బుర్రిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు పెద్దపల్లిలోని మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్, సాల్వేషన్ ఆర్మీ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్‌లలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని చోట్ల కలిపి మొత్తం 12 బూత్‌లు ఏర్పాటు చేయగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. వర్షం కారణంగా పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనా, తొమ్మిది గంటలకు 38 శాతం పోలింగ్ జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ కొనసాగింది. ఆయా పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఉదయం సందర్శించారు. బూత్‌లలో పోలింగ్ సరళిని పరిశీలించి అధికారులు, సిబ్బందికి సలు సూచనలు చేశారు. గ్రామంలో మొత్తం 2738 ఓట్లు ఉండగా పోలింగ్ ముగిసే సమయానికి 2145 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 78 శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించారు. సాయంత్రం 4.30 గంటలకు లెక్కింపు పూర్తి చేసి విజేతలను ప్రకటించారు. పోటీ చేసిన ఐదుగిరిలో పరుచూరి విజయలక్ష్మి 1787 ఓట్లు సాధించి 1526 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మిగిలిన నలుగురిలో శాఖమూరి రవీంద్రబాబు 261 ఓట్లు, శాఖమూరి వేణుగోపాలరావు 29 ఓట్లు, చందు శ్రీనివాసరావు 14 ఓట్లు, శాఖమూరి చలపతిరావు 4 ఓట్లు సాధించారు. ఇక్కడ పోలైన ఓట్లలో చెల్లని ఓట్లు 21 ఉండగా నోటాకు 29 ఓట్లు పడ్డాయి. కౌంటింగ్ పూర్తయ్యాక పరుచూరి విజయలక్ష్మిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. ఏడుకొండలు విజేతగా ప్రకటించి సంబంధిత కాపీని అందజేశారు. సర్పంచ్‌గా గెలుపొందిన విజయలక్ష్మిని పలువురు పుష్పగుచ్ఛాలతో అభినందించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవ రెడ్డి, ఎంపీడీవో విజయా లక్ష్మణ్, తదితరులు పోలింగ్‌ను పర్యవేక్షించారు. గ్రామంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు సిబ్బందితో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణను నుంచి గెలుపు ధృవీకరణ పత్రం అందుకుంటున్న శివానందం



ఎన్నికల తీరును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ



రిటర్నింగ్ అధికారి నుండి ధృవపత్రం అందుకుంటున్న విజయలక్ష్మి

ఉపఎన్నికల్లో శివానందం గెలుపు

తెనాలిటౌన్: రూరల్ మండలం హాఫ్‌పేట పంచాయతీలోని ఏడోవ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వల్లూరి శివానందం 26 ఓట్లతో మేజారిటీతో గెలుపొందారు. గ్రామంలోని ఏడోవ వార్డు మెంబర్ వల్లూరి శ్రీనివాసరావు గతంలో మృతి చెందడంతో ఉప ఎన్నిక జరిగింది. ఉప ఎన్నికల్లో కోటిపల్లి నరసింహారావు, వల్లూరు శివానందంలు పోటీ చేశారు. వార్డుల్లో 152 ఓట్లకుగాను 130 ఓట్లు పోలైన్నాయి. ఈ ఓట్లలో శివానందానికి 78 ఓట్లు రాగా నరసింహారావుకు 52 ఓట్లు వచ్చాయి. పోలింగ్ గ్రామంలోని సచివాలయంలో ఆవరణలో ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయ్యే మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగింది. అనంతరం ఓట్ల లెక్కింపు జరగగా శివానందం 26 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ రావు ప్రకటించారు. గెలుపు ధృవీకరణ పత్రాన్ని శివానందంకు ఆర్‌ఓ అందజేశారు. సర్పంచ్ తలమాల ఎర్రయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని తెనాలి డీఎస్పీ జనార్ధరావు, జిల్లా పంచాయతీ అధికారి కేసవరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డిలు సందర్శించారు. రూరల్ ఎస్ఐ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం

తెనాలిఅర్బన్: ప్రపంచ ఫొటోగ్రాఫి దినోత్సవ వేడుకలను ది తెనాలి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లోని కృష్ణ స్టూడియోలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను అధ్యక్షుడు వీరపాటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూరగటి రవిశంకర్‌లు కట్ చేశారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్ చుక్కా శ్రీనివాస్‌బాబు, శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం శివాజీచౌక్‌లో పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సీహెచ్.రఘుకుమార్, ఎం.ప్రభాకర్, కె.కృష్ణ, అనిల్‌కుమార్, చిరంజీవి, బాబీ, తదితరులు పాల్గొన్నారు.



ఫొటోగ్రాఫర్ శ్రీనును సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

తెనాలిఅర్బన్: ఆర్టీసీ అధికారుల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారంతో నాల్గొవ రోజుకు చేరాయి. దీక్షల్లో కండక్టర్ కె.అశోక్‌కుమార్, డ్రైవర్ ఎ.శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. వీరికి కొంతమంది ఉద్యోగులు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌వీపీ.బాబు, ఎస్.సుధాకర్, జె.వేణుగోపాల్, చిట్టిబాబు, వి.పాపారావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

25న సీపీఎం ఆధ్వర్యంలో సభ

తెనాలిఅర్బన్: ప్రభుత్వ విధానాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు అనే అంశంపై సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 25న గుంటూరులో జరిగే సభలో అందరూ పాల్గొనాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. తెనాలి మండలం గుడివాడ, కొలకలూరు, ఖాజీపేట గ్రామాల్లో సభకు సంబంధించిన కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రకృతి వనరులను ప్రవేట్‌పరం చేస్తున్నారని ఆరోపించారు. ఆగస్టు 25 మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు, జిల్లా కార్యదర్శి పాశం రామారావులు ముఖ్యఅతిథులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో జ్యోతులు కోటేశ్వరరావు, బండి సుధాకర్, తురకా ఏసుపాదం, వేజండ్ల మరియదాసు, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ అసైన్డ్ ల్యాండ్‌లను గుర్తించండి

కొల్లిపర: మండలంలోనే వివిధ గ్రామాలల్లో 2003కు ముందున్న అగ్రికల్చర్ అసైన్డ్ ల్యాండ్‌లను వీఆర్‌ఓలు వెంటనే గుర్తించి రికార్డుల రూపంలో తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ జి.నాంచారయ్య ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, సచివాలయం సర్వేయర్లులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఈఓఎల్‌ఆర్ మరియు సి.సి కార్డులు పై కూడా దృష్టి సాధించాలని పేర్కొన్నారు. వారంలో అగ్రికల్చర్ అసైన్డ్ ల్యాండ్‌కు చెందిన రికార్డులను అందించాలని సూచించారు. కార్యకర్యక్రమంలో మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో కిసాన్ మహోత్సవ్ 2023

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహోత్సవ్-2023 నిర్వహించినట్లు వైస్ చాన్సలర్ జి.పార్ధసారధి వర్మ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరమండల్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు జి.వి.సుబ్బారెడ్డి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ఆహార డిమాండ్‌ను తీర్చడానికి ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం ప్రాముఖ్యత అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం వ్యవసాయంలో 2022వ సంవత్సరంలో రాష్ట్రంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రైతులకు వార్షిక అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రి మార్కెటింగ్, వ్యవసాయ కోఆపరేటివ్ విభాగ ముఖ్య కార్యదర్శి చిరంజీవ్ చౌదరి, ఏరువాక ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాఘవరావు, కేఎల్‌యూ ప్రొ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాధరావు, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, కేఎల్‌టీఎఫ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి అలోక్ గోవిల్, పరిశోధనా అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ శరత్, ఏసీఐసీ సెంటర్ విభాగాధిపతి రమస్‌కాంత్, వ్యవసాయ విభాగాధిపతి సెంథిల్ మురుగన్, డైరెక్టర్ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మహోత్సవ్‌ను ప్రారంభిస్తున్న కోరమండల్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి

ప్రజా సమస్యలపై ప్రి లిటిగేషన్ కేసు

తెనాలిరూరల్: వవిధ ప్రజా సమస్యలపై ప్రి లిటిగేషన్ కేసు వేసి నట్టు మాజీ న్యాయవాది పెరికల డేనియల్, న్యాయవాదులు గజ్జా శ్రీనివాస్‌గౌడ్, కేఎస్‌వీ అంజనీకుమారి తెలిపారు. శనివారం వారు విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వీధి కుక్కల స్వైర విహారం, నిర్మానాలకు సంబంధించిన సిమెంటు, ఇసుక, కంకర వంటివి రోడ్లుపైనే ఉంచడం వల్ల కలుగుతున్న ఇబ్బందులు, స్వీటు షాపుల్లో ఎక్స్‌పైరీ డేట్‌లేకుండా మిఠాయిలు అమ్ముతుండడం వంటి పలు విషయాలపై వేసిన ప్రి లిటిగేషన్ కేసు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ముందు ఈ నెల 26వ తేదీన వాయిదాకు వస్తుందని తెలిపారు.

సురక్షిత నీటితో రోగాల బారి నుంచి కాపాడవచ్చు

మేడికొండూరు: సురక్షిత నీటిని ప్రజలకందించడం ద్వారా నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టవచ్చని గుంటూరు ప్రాంతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జోత్స్న అన్నారు. నల్లపాడు ప్రాంతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శిక్షణ కేంద్రంలో 42 రోజులపాటు ఎల్‌హెచ్‌వీ శిక్షణ పొందిన మహిళ ఆరోగ్యకర్తలను శనివారం మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సమగ్ర రక్షిత నీటి సరఫరా కేంద్రానికి తీసుకెళ్లారు. రక్షిత నీరు వివిధ దశల్లో నీరు శుద్ధి జరిగే విధానం గురించి వారికి వివరించారు. ఆమె మాట్లాడుతూ సురక్షిత నీరు తాగకపోవడం వల్ల సీజనల్ వ్యాధులైన కలరా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సురక్షిత నీటి నీరు సేవించాలన్నారు. ప్రజలకు తాగునీటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ అనిరుద్, శిక్షణ కేంద్రం బోధనా సిబ్బంది డాక్టర్ భాస్కరరావు, సీహెచ్.నాగేశ్వరరావు, వి.వి.శ్రీరామమూర్తి, ఎర్రంరెడ్డి, వి.చింతారావుబాబు, జి.రేణుక, సీహెచ్.కె.వి.రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.



మేడికొండూరు సమగ్ర రక్షిత నీటి కేంద్రాన్ని సందర్శించిన మహిళ ఆరోగ్య కార్యకర్తలు

వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కృషి

లక్ష్మీపురం: వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రత్యేక అధికారి షేక్ షిరిన్ బేగ్ సహకారంతో కృషి చేస్తామని గుంటూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు మస్తాన్ తెలిపారు. నగరంపాలెంలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ బోర్డుకు రెడ్డిపాలెంలో 187 ఎకరాలు, కాకాని రోడ్డు నిర్మిస్ సొసైటీలో 78 ఎకరాలు, పొన్నూరు రోడ్డులో గల షాబా మజీద్ దర్గాలో ఏడు ఎకరాలు.. ఇలా జిల్లా వ్యాప్తంగా వేల కోట్ల రూపాయల ఆస్తులున్నాయని గుర్తు చేశారు. వాటిలో ఇప్పటికే కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురయ్యాయని ఆరోపించారు.

కార్డుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

తాడికొండ: డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులతో సౌమ్యంగా ప్రవర్తించి పంపిణీలో లోపాలు లేకుండా చూడాలని డీఎస్‌వో పి కోమలి అన్నారు. శనివారం తాడికొండ షిర్డీసాయి బాబా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎండీయూ ఆపరేటర్ల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పంపిణీ సమయంలో కార్డుదారులతో మర్యాదగా మాట్లాడి సమస్యలు ఉంటే తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళితే సత్వర పరిష్కారం చేస్తామన్నారు. ఫోర్టిఫైడ్ రైస్ అందిస్తున్న ప్రభుత్వం కార్డుదారులు తినడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేసి ప్రతి ఇంటా వాడుకునేలా చూడాలన్నారు. ఎక్కడైనా లోపాలు జరిగినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని, వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తాడికొండ డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, సివిల్ సప్లయీస్ ఆర్ఐ కోటేశ్వరరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్‌వో పి కోమలి

ఘనంగా వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు లలిత కళల విభాగాధిపతి సుభాష్ యలవర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వాతావరణంలో వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ నైపుణ్యాలను అభ్యసించే అవకాశం ఉంటుదన్నారు. ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ డాక్టర్ యోగేష్ బాబు తుంగా, ప్రశాంత్‌లు ఆన్‌లైన్ ద్వారా ఫొటోగ్రఫీలోని ప్రధాన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల కెమెరాలు, వాటికి ఏర్పాటు చేసుకోవాల్సిన వెలుతురు, మెళకువలను వివరించారు. కెమెరా వినియోగం, ఎక్స్‌పోజర్, కంపోజిషన్‌తో సహా వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ ప్రాథమిక అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితం అంధకారం

న్యాయమూర్తి శ్రీసీత

తెనాలిరూరల్: విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, తోటి విద్యార్థులతో స్నేహ భావంతో మెలగాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత అన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి ఆదేశాల మేరకు దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ర్యాగింగ్ భూతం పడగలు విప్పి విద్యార్థులను బలి తీసుకుంటోందని ,అభం శుభం తెలియని విద్యార్థులు అర్ధాంతరంగా తనువుచాలిస్తూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాగింగ్ చేసిన వారు సైతం జైలు బాట పట్టి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, సరదా పరిచయాలు శ్రుతి మించి ప్రాణాల మీదకు వస్తున్నాయన్నారు. సమిసిపోయింది అనుకున్న సమస్య మళ్లీ జడలువిప్పి నాట్యం చేస్తోందని ఈ నేపథ్యంలో ర్యాగింగ్‌కి పాల్పడితే శిక్షలు ఎంత కఠినంగా ఉంటాయో తెలుసుకోవాలని చెప్పారు. దుస్తులపై వ్యాఖ్యానం, గుంజీలు తీయమనడం, పరుగులు పెట్టించడం, గోడ కుర్చీ వేయించడం, అసభ్యకరంగా, కించపర్చేలా మాట్లాడడం తదితర వేధింపులకు పాల్పడటం నేరమని ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులు నెల రోజుల పాటు కళాశాల నుంచి సస్పెండ్ అవుతారని, ఏడిపించడం, హేళన చేయడం, ఇతర ఇబ్బందులకు గురిచేయడం లాంటి వాటికి ఆరు నెలల జైలుశిక్ష ఉందని, శారీరకంగా వేధించినా, బలప్రయోగం చేసినా ఏడాది జైలుశిక్ష విధించే అవకాశముందని తెలిపారు. అడ్డుకున్నా, గాయపర్చినా రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. ఐదు వేల జరిమానా విధించడం జరుగుతుందన్ని హెచ్చరించారు. అపహరణ, అత్యాచారం, తీవ్రంగా గాయపర్చడం చేస్తే అయిదేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా ఉంటుందన్నారు. ర్యాగింగ్ వేధింపులతో తోటి విద్యార్థి మృతి చెందినా, ఆత్మహత్యకు కారణమైనా జీవితకాలం జైలుశిక్ష పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బాధితులు ఫిర్యాదు చేయడానికి వీలుగా ఫిర్యాదు పెట్టె, ఫోన్ నంబరు, ఈమెయిల్ అడ్రస్ వంటివి అందుబాటులో ఉంచాలని , ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షకు గురవుతారనే బోర్డులను కళాశాల ఆవరణలో ప్రదర్శించాలని ,స్థానిక పోలీసు అధికారుల మొబైల్ నంబర్లను ప్రదర్శించాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. ర్యాగింగ్ బారినపడిన విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, ఆందోళనలను తగ్గించేందుకు సైకియాట్రీ సేవలు కల్పించాలని సూచన చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాల్‌రావు, సీనియర్ న్యాయవాది యస్ వి మహేశ్వరరావు, జీజీహెచ్ మానసిక వైద్యురాలు మంజరి ప్రిన్సిపల్ లక్ష్మీ నారాయణ, దుగ్గిరాల ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీసీత

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు

కొల్లిపర: పరిసరాల పరిశుభ్రతతో, దోమల నిర్మూలనతో ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు అన్నారు. శనివారం స్థానిక పాలకేంద్రం కల్యాణ మండపంలో ప్రపంచ దోమల దినోత్సవ కార్యక్రమంపై మండలంలోని వైద్యాధికారులతో, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని పాటించాలని డాక్టర్లు ప్రతి గ్రామంలో ప్రజలకు దోమల నిర్మూలతో కలుగు ప్రయోజనాలపై అవగాన కలిపించాలని సూచించారు. అనాఫిలస్ అనే ఆడ దోమ కాటు వల్ల మలేరియా సోకి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మలేరియా వ్యాధి అనాఫిలస్ అనే ఆడ దోమ కాటు వల్ల వస్తోందని ఆగస్టు 20న తొలిసారిగా సర్ రోనాల్డ్ రాస్ శాస్త్రవేత్త కనిపెట్టినట్టు తెలిపారు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.సుబ్బరాయణం మాట్లాడుతూ దోమలు వాటి ఉత్పత్తి స్థానాలు మరియు వాటి ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ప్రపంచ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దోమలు నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెట్టి తమ సంతతిని పెంచుకుని తద్వారా ప్రజలకు కుట్టడం వల్ల వివిధ రకాలైన మలేరియా, డెంగీ , చికిన్ గునియా , బోదకాలు, మెదడు వాపు వంటి వివిధ రకాల వ్యాధులు వస్తాయని తెలిపారు. తొలుత సర్‌రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ హనుమంతరావు, నేషనల్ హెల్త్‌మిషన్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ చుక్క మన్మోహన్, కొల్లిపర కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరెంటెండెంట్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, కొల్లిపర మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ వేముల ప్రియాంక, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ కె.శాంతకుమారి, మలేరియా అసిస్టెంట్ అధికారులు డి.రాజునాయక్ , వంగల పున్నారెడ్డి, మున్నంగి, ఈమని , దుగ్గిరాల ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రముల డాక్టర్లు, సిబ్బంది ఆరోగ్య విస్తరణాధికారులు, స్టాఫ్ నర్స్‌లు, హెడ్ నర్స్‌లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, ఏఎన్‌ఎమ్‌లు, ఆషా కార్యర్తలు, పాల్గొన్నారు.



దోమల నిర్మూల, మలేరియా వ్యాధిపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వేతన ఒప్పందాన్ని పునఃసమీక్షించాలి

తెనాలిరూరల్: ఈనెల తొమ్మిదో తేదీ పవర్ జాక్‌తో విద్యుత్తు యాజమాన్యం, ప్రభుత్వం కలసి జరిపిన పే రివిజన్ చర్చలలో జరిగిన ఒప్పందం విద్యుత్ రంగంలో అన్ని వర్గాల వారికి నష్టం కలిగించే విధంగా ఉన్నాయని తెనాలి డివిజన్ ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ల స్ట్రగుల్ కమిటీ నాయకుడు ఎస్. గురుబ్రహ్మం అన్నారు. తెనాలి డివిజన్ ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్‌ల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో సెక్షన్ ఆఫీస్, సబ్ డివిజన్, రెవెన్యూ విభాగం డివిజన్ ఆఫీస్ కార్మికులు అందరితో సంతకాలు సేకరణ సేకరణ శనివారం నిర్వహించారు. గురుబ్రహ్మం మాట్లాడుతూ వేతన ఒప్పందన్ని పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. దాసరి వెంకటేశ్వరరావు సిబిటియూ నాయకుడు కె. బాబు ప్రసాదరావు, మునిపల్లి శ్రీకాంత్,కొండలు, భాస్కర్, నాయక్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శిక్షణ

మంగళగిరి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మంగళగిరి ఆధ్వర్యంలో శనివారం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి తక్షణం చేయాల్సిన ప్రథమ చికిత్సపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్, యాక్సిడెంట్, పాముకాటు, కుక్కకాటు బారినపడినప్పుడు డాక్టర్ వద్దకు తీసుకువెళ్లే లోపల తక్షణం చేయాల్సిన ప్రథమ చికిత్స ఆచరణాత్మక విధానంలో శిక్షణనిచ్చారు. కార్యక్రమానికి మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వారితోపాటు విజయవాడ, గుంటూరు, పాలకొల్లు, పర్చూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి 144 మంది హాజరయ్యారు. గుంటూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పి రామచంద్రరాజు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రథమ చికిత్స విధి, విధానాలపై శాస్త్రీయంగానూ, ఆచరణాత్మకంగానూ శిక్షణ ఇస్తుందని, సేవా దృక్పథం కలిగిన యువత ఇలాంటి శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని తర్ఫీదు పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల అధ్యక్షుడు ఇసునూరు చంద్రమోహన్, కార్యదర్శి వెనిగళ్ల తాతారావు, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, హైకోర్టు మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ సెంటర్ సభ్యులు దామర్ల వెంకట నరసింహం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, ఈసీ సభ్యులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహనరావు, షేక్ సంధానీ, గుంటి నాగరాజు, డాక్టర్ కేవీ సాయిప్రసాద్, డాక్టర్ గోలి రామ్మోహనరావు, డాక్టర్ నందం రామారావు, రెడ్‌క్రాస్ రిసోర్స్‌పర్సన్ షేక్ జానీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ చికిత్సపై శిక్షణ ఇస్తున్న దృశ్యం